


జోరున కురిసిన వాన రోడ్ల మీద నన్న నన్నని పిల్ల కాలువలు తీసేక గాని ఉధృతం తగ్గించలేదు. తేటపడిన ఆకాశం అద్దంలా మెరుస్తోంది. వచ్చగా కళ కళ లాడుతోన్న చెట్ల ఆకులు జిలి జిలి చినుకులకు పులకిస్తూ పరవశంతో తలలూగిస్తున్నాయి.

ఆహ్లాదకరమైన ఆ సాయం సంధ్యవేళ ముందు గదిలో కూర్చొని, ఆర్ద్రత చెందిన ప్రకృతి సౌందర్యాన్ని అవలోకిస్తూ, సుమతి ఇచ్చివెళ్లిన వేడి టీ సిప్ చేస్తూ, స్టీరియోపై తన కిష్టమైన ఘంటసాల పాటలు వింటూ మధురానుభూతి ననుభవిస్తోన్న వేణుగోపాల్, గేటు తీసిన చప్పుడు అంతరాయం అనిపించగా కిటికీ గుండా అవతలకు చూసేడు.

ఆకాశంలో హరివిల్లు నేల జారిందా అన్నట్లు గులాబీరంగు చీర, జాకెట్లు ధరించిన వింధ్య చిరునవ్వులో తడుస్తూనే లోపల కొచ్చింది.

ఈసారి ఆమెను చూడడం చాలా రోజులే అయిందనిపించింది.

ఆమెను, ఆ ముఖంలో విరిసిన సంతోషాన్ని చూడగానే అతడికి అమితానందం కలిగింది ఎందుకో గాని.

"రండి" హృదయ పూర్వకంగా ఆహ్వానించేడు.

చిరునవ్వుతో లోపలి కొస్తూనే అంది వింధ్య, "అప్పాయింట్ మెంట్ ఆర్డర్స్ వచ్చేయి వేణుగారూ! వారం రోజుల్లో జాయినవమన్నారు."

ఆ సంతోషానికి కారణం తెలిసేక మరింత ఆనందపడ్డాడు. "చాలా సంతోషం వింధ్యా! ఇంత తొందరగా మీకు జాబ్ వస్తుందనుకోలేదు. మీ కృషి ఫలించింది."

"మీరు శ్రమ తీసుకొని ప్రయత్నం చేయకపోతే ఇంత తొందరగా వచ్చేదా? నన్నిలా నిలబెట్టినందుకు మీకు, ఎంతో ధైర్యం చెప్పి నాలో జీవంపోసిన సుమతికి నే నెంతో ఋణపడి వున్నాను నిజంగా."

ఆ కళ్లల్లో ఏ జ్ఞాపకాలు కదిలేయో గాని చెమరించిన చివ్వులు ప్రస్ఫుటమయ్యేయి. అవి మనోహర్ తాలుకు మధురస్మృతులేనని తెలిసి మౌనం దాల్చేడు, గుండె ఆర్ద్రత చెందగా.

ఆకాశంలో విహరించే అంతవరకైన అన్యోన్యతగల పక్షి జంటలో ఒకటి విధి చూపిన చిన్న చూపుకు, వేలకరిస్తే అనహాయురాలైన ఆడపక్షి రెక్కలు తెగిన దానిలా అయి పోగొట్టుకున్న తోడు కోసం, నీడ కోసం విలపిస్తుంటే మానవత కలిగిన ఏ గుండె చెమరించదు? ఏ కన్నుల్లో నీరు నిండదు? ఎవరు మిన్నకుండ గలరు?

రెండు కుటుంబాల మధ్య నున్న స్నేహ బంధాన్ని పునస్కరించుకొని వింధ్యను ఆదుకొన్నారు తను, సుమతి. ఓదార్చేరు. ధైర్యం చెప్పేరు.

సుమతి గుండె చెరువవగా, "పాతికేళ్ళు నిండకుండానే పసుపు కుంకుమ నేల రాలిన దౌర్భాగ్యపు బతుకు పగవాళ్ళకు కూడా వద్దండీ! ఇంత అన్యోన్యంగా వుండే జంటను చూస్తే భగవంతుడికి కూడా అసూయే కాబోలు! ఆ లారి అతడి ప్రాణానే తీసుకోవాలా? మూడేళ్ళు నిండని పసివాడు నోరారా సరిగ్గా నాన్నా అని పిలవకుండానే, ఆ నాన్న అదృశ్యమైపోవాలా? వింధ్యను చూస్తే గుండె తరుక్కుపోతోందండీ!" అంటూ కన్నీరు కార్చే సుమతిని తను ఓదార్చవలసి వచ్చింది.

ఆడవాని పసుపు కుంకుమల పట్ల సాటి ఆడదాని కెంత ప్రీతి? మోడువారిన స్త్రీ జీవితం, సాటి స్త్రీని ఇంతగా గుండెకోత కోస్తుందని సుమతిని చూసేకే తెలిసింది.

వింధ్య ఆ దుఃఖాన్ని మరిచేందుకు సుమతి చేయని ప్రయత్నం లేదు. కన్నీరు తుడిచి గుండెల్లో పొదువుకొంది "బాబు కోసం మామూలుగా వుండాలి వింధ్యా! వాడు బెంబేలుపడి పోతాడు" అంటూ ధైర్య వచనాలు పలికి జీవం పోసింది.

ఆ జీవమే వింధ్యలో లేలేత చివుళ్ళు వేయించింది.

జీవితం పట్ల ఆశలు కలిగించింది.

టప్పున ఏదో క్రిందపడిన శబ్దం లోపల!

ఉలిక్కిపాటుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డారు ఇద్దరూ ఆలోచనల నుండి.

కొంగుతో ముఖం తుడుచుకొంటూ, "ముందు ఈ వార్త సుమతికి చెప్పాలని వచ్చేను." అంటూ గబగబ లోపలికి వెళిందివింధ్య.

"ఏమిటిది సుమతీ! దేనికో తిలోదకాలిచ్చేసినట్లున్నావే?"

## బ్రాహ్మణ వధువు కావాలి

నియోగి బ్రాహ్మణుడు, వయసు 25, కాశ్యపస, ప్రెస్సులో మెషిన్‌మన్, జీతం రు. 250/- బ్రాహ్మణ కన్య కావాలి.

రామచంద్రరావు,
1-9-34/1/1, కమ్యూనిటీహాలువద్ద, రాంనగరు, హైదరాబాదు—48.



మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్ & బాల్ పెన్స్
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి
అశోకాపెన్‌వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)



డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.



వివాహము వాయిదా వేయ నవసరము లేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి,
ఫోన్: 700, 1010.







# జాలిగుండె లోతుల్లో

"ఓ... వినపడిందా మీకూ!" గాజు పెంకు పగిలిన నవ్వు.

"ఇంకా వంటపనే? సాయంత్రం చల్ల గాలికి కొంచెం సేపు తీరుబాటుగా కూర్చొని ప్రకృతి సౌందర్యాలు పరిశీలించకుండా..." నవ్వుతూ అంది వింధ్య.

"నా కెందుకు తల్లీ, ఆ సౌందర్యాలు, పరవశాలు? నీలాంటి చదువుకున్న వాళ్లకు, ఉద్యోగాలు చేయబోయే వాళ్ళకు గాని!"

వింటోన్న వేణుగోపాల్ తెల్లబోయేడు. హాల్లో వుండిపోవడం వలన వింధ్య ముఖ కవళికలు ఎలా మారేయో చూడలేక పోయేడు గాని, ఆమె సున్నిత హృదయం గాయపడి వుంటుందని మాత్రం నిర్ధారించుకొన్నాడు.

సుమతి కివాళ ఏమైంది? ఇవాళే కాదు ఇటీవల ఆమెలో వస్తున్న మార్పు గమనిస్తూనే వున్నాడు.

వింధ్య పట్ల ఆమె గుండెలనిండా పేరుకు పోయిన సానుభూతి, కరుణ, ప్రేమ కొంచెం కొంచెంగా కరిగిపోవడం గమనిస్తూనే వున్నాడు ఆమె గురించి బాధ పడుతూ కబురు చెప్పడం లేదిప్పుడు పూర్వంలా రాక పోకలూ లేవు.

ఒక్కసారిగా సుమతిలో వచ్చిన మార్పుకు కారణం అతడికి బోధపడలేదు.

ఆ రాత్రి పక్కలు దులిపి వేస్తోన్న సుమతితో అన్నాడు-

"వింధ్యకు ఉద్యోగం వచ్చింది కనుక ఆమె జీవితం ఒక గాడిన పడినట్లే! బాబు ఆమె బ్రతుక్కి అర్థం అయితే, వుద్యోగం పర మార్థం అయింది. ఆమె గుండె నిబ్బరానికి పట్టుదలకు మనం నిజంగా సంతోషించాలి."

"పాపం, చాలా సంతోషంగా వుందను కొంటాను మీకు?" కంటి కొసల్లో ఓరగా చూస్తూ అంది సుమతి.

ఆశ్చర్యపోతూ అన్నాడు "ఆమెలో వచ్చిన ఈ మార్పు సంతోషదాయకం కాదా సుమతీ? పరీక్షలకు కట్టి పాసయి, ఉద్యోగ ప్రయత్నాలు చేసి, చివరకు తన కాళ్ళమీద తాను నిలబడ గలగడం సామాన్య విషయమా? అంత గుండె నిబ్బరం, ఆత్మవిశ్వాసం ఎంతమంది ఆడవాళ్ళ కుంటుంది? మనం కోరుకున్నదీ ఆమె దుఃఖాన్ని మరచిపోవాలనే కదా?"

"పెళ్ళి లేకపోతే సరి! మొగుడు పోయి



మహిషాసుర మర్దిని
[చిత్రం : టి. వి. యస్. మూర్తి]

ఏడాది అయిందో లేదో చదువంది, పరీక్ష లంది, ఉద్యోగమంది, ఇక రేపు పెళ్ళం టుంది! ఆ చీరలూ, ఆ షోకులూ చూడ రాదూ! చూసిన వాళ్ళు నోళ్ళు నొక్కు కుంటున్నారు ఎవరైనా దుఃఖాన్ని మరచి పోవాలంటారు గాని, ఇలా బరితెగించ మంటారా?"

గుండెల్లో పొదువుకొని ఓదార్చి, ఆమె దుస్థితికి కన్నీరు కార్చిన కరుణామయి సుమతేనా?

"మా మేనత్త కూతురు మీనాక్షిని చూడండి. భర్త పోయి నాలుగేళ్ళ యినా ఈ నాటికీ వీధి గుమ్మం చూసి ఎరుగదు. ఇప్పటికీ అతడిని తలుచుకొని కుమిలి పోని రోజు లేదు. ఆ దిగులుతోనే చిక్కి శల్యం అయ్యింది ఎవరెన్ని చెప్పినా మామూలు మనిషి కాలేకపోతోంది. మొగుడ్ని మరచి పోలేకపోతోంది. అంతే గాని ఈ విపరీతం, ఈ బరితెగింపూ ఎక్కడా చూడ లేదు సుమా!" టక్కున దీపం ఆర్పేస్తూ మంచం మీద వాలిపోయింది సుమతి.

ఆమె జాలిగుండె లోతుల్ని అర్థం చేసుకొన్న వేణుగోపాల్ ఇక మాట్లాడటం మూర్ఖత్వమే అవుతుందను కొన్నాడు!